

తొర్రూరులోని హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న మంత్రి ఎర్రబెల్లి



అమ్మాపురం క్రాస్ రోడ్డులో టీ తయారు చేసి పలువురికి అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- **బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి**
- **తొర్రూరులో మార్నింగ్ వాకర్స్‌తో చిట్‌చాట్**

తొర్రూరు, నవంబర్ 19 : బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని తొర్రూరు మున్సిపల్ కేంద్రంలో ఆదివారం వేకువజామునే మార్నింగ్ వాకర్స్‌తో కలిసి నడిచారు. తొర్రూరు పట్టణ అభివృద్ధికి తాను చేసిన పనులను వివరిస్తూ మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను కోరారు. యతిరాజారావు పార్క్ ఆవరణలో, అమ్మాపురం రహదారి వైపు, హైస్కూల్ ఆవరణలో మార్నింగ్ వాక్ చేస్తున్న వారితో, యువకులతో సరదాగా మాట్లాడారు. ఎన్నికల సరళిని వివరిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు తాను చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. మరోసారి గెలిచిన అనంతరం చేపట్టే అభివృద్ధి పనులపై హామీ ఇస్తూ తన ప్రచారాన్ని కొనసాగించారు. తొర్రూరు హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో టీచర్స్, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి సందడి చేశారు.

### సరదాగా చాయ్ అమ్ముతూ...

మార్నింగ్ వాక్ అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అమ్మాపురం క్రాస్ రోడ్డులో ఉన్న టీస్టాల్ వద్ద స్వయంగా టీ తయారు చేశారు. తనతో వచ్చిన వారితో పాటు వాకర్స్, సామాన్య ప్రజానీకానికి చాయ్ అందజేస్తూ సరదాగా సందడి చేశారు. ఆ తర్వాత బైక్‌పై పట్టణంలో చక్కర్లు కొడుతూ తాను చేసిన అభివృద్ధి పనులను పరిశీలిస్తూ హరిపిరాల క్రాస్ రోడ్డులో పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించారు. వేకువజామునే ప్రారంభమైన ప్రచారం రెండు గంటల పాటు కొనసాగింది. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు. అనంతరం మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జినుగ మల్లారెడ్డి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

నాంచారిమడూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమయ్య, మహంకాళి మహిపాల్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కొడకండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరి ఎర్రబెల్లికి మద్దతు తెలిపారు. రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ ఉపాధ్యక్షుడు లకావత్ శ్రీను, హుస్సేన్, దేవేందర్, సుమన్, బిచ్చా బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు,కార్యకర్తలు

# నాన్ లోకల్ వ్యక్తులకు స్థానం లేదు

- **డోర్నకల్‌ను అభివృద్ధిలో ముందుంచా..**
- **మరోసారి ఆశీర్వదిస్తే మీ రుణం తీర్చుకుంటా..**
- **కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలను కొనితెచ్చుకునుడే..**
- **ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్**

చిన్నగూడూరు, నవంబర్ 19 : డోర్నకల్ నియోజకవర్గంలో నాన్ లోకల్ వ్యక్తులకు స్థానం లేదని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం ఆయన చిన్నగూడూరు మండలంలోని విస్సంపల్లి, టీసీతండా, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, జయ్యారం, మన్నెగూడెం, గండోరిగూడెం, మేఘ్యాతండా, గుండంరాజుపల్లి, పగిడిపల్లి, శివారుతండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలు, గూడేల్లో ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో రెడ్యా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురై రైతులు అరిగోస పడ్డారని అన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రాజెక్టులు కట్టి తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని అన్నారు. రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటుతో వ్యవసాయాన్ని పండుగలా మార్చారని అన్నారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి, వృద్ధులు, దివ్యాంగులకు ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్ వంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేసిన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. ఎన్నికలు రాంగనే పల్లెలోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలకు ప్రజలు మోసపోవద్దన్నారు. డోర్నకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచిన తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మావెంకటరెడ్డి, జడ్పీటీసీ మూల సునీతామురళీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాంసింగ్, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ మంగపతిరావు, మహిళా అధ్యక్షురాలు నిరూప, నాయకులు కొమురెల్లి, మల్లేశ్, వెంకటేశ్వర్‌రావు, హుస్సేన్, ధారాసింగ్, చెన్నయ్య, చెన్నారెడ్డి, బంటు ఉపేందర్, దుండి మురళి, మంగీలాల్, ఐలయ్య, సురేశ్, రాము పాల్గొన్నారు.

# వలస పార్టీలను నమ్మొద్దు

- **కాంగ్రెస్‌కు ఓటేస్తే మనకూ కర్ణాటక దుస్థితే..**
- **ఒక్క హామీని నెరవేర్చని బీజేపీకి ఓటడిగే హక్కులేదు**
- **బీఆర్‌ఎస్ పాలనలో దేశంలోనే నంబర్‌వన్‌గా తెలంగాణ**
- **నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత.. ఆదరించడం మీ బాధ్యత**
- **బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్**



శ్రీరామగిరిలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెల్లికుదురు, నవంబర్ 19: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది.. కారు గుర్తుకు ఓటేసి గెలిపించే బాధ్యత మీదని బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. నెల్లికుదురు మండలంలోని కాచికల్లు, ఎర్రబెల్లిగూడెం, సౌల్లతండా, బడితండా, మేచరాజుపల్లి, పెద్దతండా గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజ లు ఎమ్మెల్యేకు వీర తిలకందిద్ది మంగళహారతులతో స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు రాంగనే ఓట్లు దండుకొని అధికారంలోకి రావాలని ఆరాటపడుతున్న వలస పార్టీలు కాం గ్రెస్, బీజేపీలను నమ్మితే భవిష్యత్ గోస తప్పదన్నారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ కేవలం పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ఎన్నికలు వస్తాయి.. పోతా యి.. కానీ, అభివృద్ధి చేసిందెవరో ఆలోచించి ఓటు వేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రూ.200 ఉన్న పింఛన్‌ను సీఎం కేసీఆర్ రూ.2వేలకు పెంచారని అన్నారు. వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్‌ను నమ్మితే కర్ణాటక ప్రజల దుస్థితి మనకూ పడుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముప్పుతిప్పలు పడిన రైతుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టడంతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. ఇంటింటికీ తాగునీళ్లు, 24 గంటల కరెంట్, రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి ఎన్నో పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలో నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ పదేండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదన్నారు. సమ్మక్క–సారక్క జాతరకు జాతీయ హోదానిచ్చిందా..?, బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసిందా..?, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిందా..? ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఇలాంటి పార్టీలకు ఎందుకు ఓటెయ్యాలన్నారు. మ్యానిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను అమలు చేసిన కేసీఆర్‌కు, ఇప్పుడు మ్యానిఫెస్టోలో పెట్టిన వాటిని అమలు చేయడం పెద్ద లెక్క కాదన్నారు. పదేండ్లుగా మీ కష్ట సుఖాల్లో పాలు పంచుకున్న తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ భూక్యా బాలాజీనాయక్, మండల కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు దేవేందర్‌రావు, కాసల లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిని అనిల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బానోత్ భీముడు, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్, నెల్లికుదురు సర్పంచ్ యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సావిత్రమ్మ, నాయకులు గొట్టిముక్కలు ప్రభాకర్‌రెడ్డి, సంతోశ్, శ్రీనివాస్, కిరణ్, బొమ్మర ఎల్లగౌడ్, బిక్కూనాయక్, సందీప్ పాల్గొన్నారు.

### 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరిక

కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా కాపాడుకుంటానని, కొత్త, పాత అనే తేడా లేకుండా పార్టీలో సముచిత స్థానంలో కల్పిస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి సుమారుగా 150మంది ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాషిణి, నాయకులు ఎడ్ల మహేశ్, గణేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# డబ్బు సంచులు కాదు.. ప్రజా సంక్షేమమే లక్ష్యం

- **అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలి**
- **బీఆర్‌ఎస్ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి**

మంగపేట, నవంబర్ 19 : తాను ఆస్తులు పెంచుకునేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజా సంక్షేమమే లక్ష్యమని ములుగు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలో తిమ్మంపేట, చెరుపల్లి, అబ్బాయిగూడెం, బాలన్నగూడెం, నీలాద్రిపేట, బోరునర్సాపురం, బుచ్చంపేట, నర్సాయిగూడెం, కొత్తూరుమొట్లగూడెం, కోమటిపల్లి, మంగపేట, కమలాపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆమె విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెకు పూలమాలు వేసి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో నాగజ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుగా ఉన్న కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసి, బీఆర్‌ఎస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో అరిగోసపడ్డామని, మన కష్టాలు చూసి కేసీఆర్ ఆమరణ దీక్ష చేయడం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. ఆయన పాలనలోనే మన కష్టాలు కడతేరాయని తెలిపారు. రాష్ట్రంలో మూడోసారి అధికారం చేపట్టేది బీఆర్‌ఎస్సే అన్నారు. ములుగులో కాంగ్రెస్‌ను కనుమరుగు చేస్తే పేదలందరికీ పక్కా ఇండ్లు, మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి ఐదు వేల ఇండ్లు మంజూరయ్యాయని, అదనంగా మరో నాలుగు వేల ఇండ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సీఎం రూ.5 లక్షల బీమా కల్పించనున్నట్లు తెలిపారు. గిరిజనేతరులకు పోడు పట్టాలతో పాటు, అసైన్డ్ భూములపై రైతులకు పూర్తి హక్కులు, రూ.400 కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేద మహిళలకు రూ.3వేల జీవన భృతి కల్పిస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమాలను ప్రజలకు వివరించారు. ఇక్కడ అమలవుతున్న జిల్లా సరిహద్దులో ఉన్న కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఇస్తున్నదని ప్రజలు గమనించాలన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.